క్లుప్తంగా

నేడు ఉద్దరాజు రామం పుస్తకావిష్కరణ

నరసాపురం: పార్లమెంట్ మాజీ సభ్యుడు, కమ్యునిస్ట్ ఉద్యమ నిర్మాణ ఉద్దరాజు రామం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఏర్పాటు చేసినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటనల విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

నరసాపురం: సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు నరసాపురం అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో గురువారం ప్రారంభమవుతాయని పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలువురు రాష్ట్ర నేతలు హాజరవుతారని తెలిపారు. నరసాపురంలో మొట్టమొదటి సారిగా పార్టీ రాష్ట్ర సమావేశాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వాసవీ శాంతిథాంలో పూజలు నిర్వహిస్తున్న కర్ణాటక వాసులు

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం కర్ణాటక భక్తులు వాసవీ పూజలు, వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిష్టా సాయి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో గోపూజ, నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం, మరకత వాసవీ మాతలకు పూజలు, అభిషేకంలు నిర్వహించిన అనంతరం వాసవీ హోమం వేడుకగా నిర్వహించారు.

బెస్ట్ ఫిజిక్ టోర్నమెంట్‌లో విద్యార్థి ప్రతిభ



ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

పాలకొల్లు అర్బన్: ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ, రాజమహేంద్రవరంలో ఈ నెల 21న జరిగిన ఇంటర్ కాలేజియేట్ బెస్ట్ ఫిజిక్ టోర్నమెంట్‌లో శ్రీ ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థి ఎ.జగదీష్ ద్వితీయ స్థానం సాధించారు. జగదీష్ ఎంఏ ఎకనామిక్స్ (ప్రథమ) చదువుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ టి రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, పీడీ జి.మహేష్ తదితరులు జగదీష్‌ను అభినందించారు.


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: రహదారులు అభివృద్ధి చేయడం వల్ల రవాణా సౌకర్యం మెరుగుపడి ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు – మార్టేరు ఆర్ అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి నిమ్మల బుధవారం శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఆర్ అండ్‌బీ డీఈ బీవీ రమణ, ఏఈ మూర్తి, నాయకులు జీవీ, కర్నేన గౌరునాయుడు, ఉన్నమట్ల కబర్ధి, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ భక్తాంజనేయ స్వామికి విశేష పూజలు



వీరవాసరం: మండలంలోని నందమూరి గురువులో శ్రీరామ భక్తాంజనేయ స్వామి 59వ వార్షికోత్సవం బుధవారంతో ముగిశాయి. ఉదయం స్వామి వారికి సింధూర, తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిగాయి. అన్న సమారాధన పెద్ద ఎత్తున నిర్వహించారు. మేకల వెంకట చలపతి, ఏసురాజు, కె.శ్రీనివాసరావు, కె.రుషికేసు దామోదర్ రావు, వడ్డీ కనకదుర్గా ప్రసాద్, కె.శ్యామలరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద వారధులు

- గ్రామాల్లో శిథిలమైన వంతెనలు
- పట్టించుకోని నాయకులు, అధికారులు



నరసాపురం-భీమవరం రహదారిలో కొప్పర్రులో శిథిలమైన వంతెన

నరసాపురం రూరల్: నియోజకవర్గంలో ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితమే వీటిని నిర్మించాల్సి ఉన్నప్పటికి వివిధ కారణాలతో వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు ఆయా వంతెనలపై ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి వచ్చింది. ప్రధానంగా వరదలు, అధిక వర్షాలు కురిసినప్పుడు ఈ వంతెనలపై రాకపోకలు మరీ ప్రమాదకరంగా మారుతున్నాయి. చాలాచోట్ల వంతెనలకు ఇరువైపులా రెయిలింగ్‌లు కూడా దెబ్బతినడంతో వాహన చోదకులు, బాటసారులు రద్దీ సమయాల్లో భయాందోళనలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. నరసాపురం నుంచి మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లే ప్రధాన రహదారిని గత పుష్కరాల్లో అభివృద్ధి చేశారు. అప్పట్లో ఈ రహదారిలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న కొప్పర్రు బద్దావారి పేట వంతెన, కె బేతపూడి సమీపంలోని తొక్కోడు వద్ద ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉండటంతో వాటిని అప్పట్లోనే నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినప్పటికీ వివిధ కారణాలతో ఇప్పటి వరకూ ఆయా ప్రాంతాల్లో వంతెనలు నిర్మించలేదు.

తరచూ ప్రమాదాలు

ముఖ్యంగా బద్దావారిపేట వద్ద మొగల్తూరు డ్రెయిన్‌పై ఉన్న వంతెనపై పలుమార్లు వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆ ప్రమాదాల్లో వంతెన రెయిలింగ్ పూర్తిగా దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మతులు చేసినా మళ్లీ తిరిగి దెబ్బతింది. ముఖ్యంగా రాత్రివేళల్లో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వంతెనలపై ప్రయాణం ప్రమాదకరంగా మారడంతో ప్రయాణం నరకప్రాయమైనదని వెంటనే నూతన వంతెన నిర్మించాలంటూ పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని పలువురు వాపోతున్నారు. అలాగే ఎల్బీచర్ల గ్రామంలోని వంతెనకు సమీపంలోనే ఉన్నత పాఠశాల కూడా ఉంది. ఈ వంతెన పై నుంచి నిత్యం రైతులు, విద్యార్థులు ప్రయాణిస్తూ ఉంటారు. ఈ వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో వారంతా భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే శిథిల వంతెనలనల స్థానంలో నూతన వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.



ఎల్బీచర్లలో రెయిలింగ్ లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెన



పాతనవరసపురంలో ప్రమాదకరంగా ఉన్న వంతెన



మొగల్తూరు మండలం దారితిప్ప వంతెన దుస్థితి

దోపిడీనే అజెండాగా కూటమి పాలన



బుడితి సుమన్

నరసాపురం: దోచుకో పంచుకో అన్న చందంగా దోపిడీనే ప్రధాన అజెండాగా రాష్ట్రంలో కూటమి సర్కార్ పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు బుడితి సుమన్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా పెంచి విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ శుక్రవారం నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టిన ఆందోళనలను నియోజకవర్గాల్లోని ఐటీ వింగ్ నాయకులు జయప్రదం చేయాలని సూచించారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపిన అదనపు భారాల తాలూకా వివరాలను ప్రజలకు అర్ధమయ్యేలా తెలియజేయాలని చెప్పారు. ప్రజలను సమీకరించి వారికి అండగా నిలబడి ఆందోళనలు విజయవతంతం చేయాలన్నారు. ప్రజా సంక్షేమ విషయంలో 7 నెలల కూటమి పాలన పూర్తిగా విఫలమైందని అన్నారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి సర్కార్ పూర్తిగా మరిచిపోయిందన్నారు. తనను రెండో పర్యాయం ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడుగా నియమించినందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు చెప్పారు.

3న భీమవరంలో సీపీఎం జిల్లా మహాసభ

పాలకొల్లు అర్బన్: సీపీఎం జిల్లా మహాసభ జనవరి 3న భీమవరంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు చెప్పారు. సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. జిల్లా మహాసభకు అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో డి.రోజా మణి, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

భీమవరం: సీపీఐ శత వార్షికోత్సవాలను పార్టీ శ్రేణులు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో వార్షికోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో వందలాది మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారన్నారని భూమి కోసం, భుక్తి కోసం, శ్రమ జీవుల బానిసత్వ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులను కాల్చి చంపారన్నారు. ప్రజల జీవనోపాధి, ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం, దోపిడీ రహిత సమాజ సాధన దిశగా వందేళ్లుగా సీపీఐ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాం ప్రసాద్, మల్లుల శ్రీనివాస్, యేలేటి విజయానంద్, వై జోయల్ తదితరులు పాల్గొన్నారు.

డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కృష్ణంరాజుకు శుభాకాంక్షలు

పాలకోడేరు: పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా కునాథరాజు మురళీకృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాలకోడేరు మండల గౌడ సంఘం నాయకులు బుధవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా మురళీ కృష్ణంరాజును ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు

- కిక్కిరిసిన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన పాస్టర్లు



నరసాపురం: మొగల్తూరు రోడ్డులోని లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

నరసాపురం: నరసాపురం పట్టణంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని మొగల్తూరు రోడ్డులో ఉన్న పురాతన లూథరన్ చర్చినలో మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి చర్చిలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రార్థనలు చేశారు. ఆలయం లోపలివైపు భక్తులతో నిండిపోవడంతో బయట కూడా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తి గీతాలు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంరోడ్డులోని చర్చి వద్ద క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణమంతా సందడి వాతావరణం నెలకొంది. పట్టణంలోని అన్ని చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: బైబిల్‌లోని వ్యాక్యాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రెవరెండ్ ఫాదర్ అయినవర్తి పీటర్ సూచించారు. బుధవారం క్రిస్మస్‌ను పురస్కరించుకుని మొగల్తూరు ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించిన క్రీస్మస్ వేడుకల్లో ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడకులు ఘనంగా నిర్వహించారు. పాలపర్తి వారిపేటలోని లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మొగల్తూరు పారిస్-2 పాస్టర్ పరిధిలో చర్చిల్లో రెవరెండ్ ఫాదర్ టి.కొండయ్య మార్టిన్ మోజెష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. సరిపల్లిలోని సెయింట్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హెర్మోన్ చర్చిలో జిల్లా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కొమానపల్లి జోసఫ్‌రాజు ఆధ్వర్యంలో, ఎల్బీచర్ల గ్రామంలోని నిర్మల చర్చిలో పాస్టర్ నిడదవోలు అనురాగరావు ఆధ్వర్యంలో, లక్ష్మణేశ్వరంలోని చర్చిలో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పార్థనలు చేశారు. మండలంలోని బైనపాలెం, సీతారాంపురం, కొత్తపేట, జవదాలపేట, పసలదీవి, రుస్తుంబాద, మల్లవరం, కె.బేతపూడి గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండ మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ఆయా చర్చల్లో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని సిద్ధాంతం సెయింట్ థామస్ లూథరన్ చెరువు పేట సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో విజయవాడ ఇంటెలిజెన్స్ డీఎస్పీ చింతపల్లి రవికాంత్ పాల్గొని క్రిస్మస్ గ్రీటింగ్స్ ఇచ్చారు. రెవరెండ్ బి.ప్రేమ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు, నిడదవోలు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నక్క అజయ్ కుమార్, చింతపల్లి జేమ్స్ తదితరులు పాల్గొన్నారు. సిద్ధాంతం జాన్ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలతో సంబరాలు అంబరాన్నంటాయి. బ్రదర్ డేవిడ్ రాజు, పాస్టర్ ప్రసాద్ నేలపూడి, బ్రదర్ ఈద రమేష్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. ఇలపర్రు సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ పి.ప్రవర్తన కుమార్, పి.మదన్ కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పెనుగొండ రాజు గూడెం లూథరన్ చర్చిలో సంఘ కాపరి పాస్టర్ ఉందుర్తి బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆచంట మండలంలో

ఆచంట మండలంలో చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నటరాజ్ థియేటర్ సమీపంలో క్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ తిమోతిరాజు ఆధ్వర్యంలో రెవరెండ్ ప్రేమరాజు క్రీస్తు సందేశాన్నిచ్చారు. కొడమంచిలి, వల్లూరు, కోడేరు మండలంలోని ఇతర గ్రామాల్లోనూ వేడకగా నిర్వహించారు.



మొగల్తూరు: ఆర్‌సీఎం చర్చిలో ఆకట్టుకున్న సెట్టింగ్‌లు



పెనుగొండ: సిద్ధాంతంలో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: ఎల్బీచర్లలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్న భక్తులు

విద్యుత్ చార్జీలతో బాదుడే బాదుడు



ఆకివీడు: పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆకివీడు: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలు బోరుమంటున్నారని జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు ఆరోపించారు. ఈ నెల 27వ తేదీన స్థానిక సబ్ స్టేషన్ వద్ద నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ ధర్నా సందర్భంగా బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్రాజు నివాసం వద్ద ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలతో పేద, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆక్వా రంగానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. లోకేష్ పాదయాత్రలో ఆక్వా పరిశ్రమకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు సామాన్యుడికి భారంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, కౌన్సిలర్లు గేదల అప్పారావు, నిమ్మల నాగు, ఎండీ.ఆలీ, అన్యెం కృష్ణ, చిక్కాల రామాంజనేయులు (చిన్నా), నాతిరెడ్డి పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి బుధవారం భీమవరానికి చెందిన దుష్యంత్ కుమార్, అరుణకుమారి దంపతులు 24 గ్రాముల బంగారం ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మీ నగేష్, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

పాలకొల్లు అర్బన్: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంత్యుత్సవం కేంద్ర ప్రభుత్వం వంద రోజుల పండుగా నిర్వహించాలని ప్రకటించిన నేపథ్యంలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. పట్టణ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో కేక్ కట్ చేసి పంచుకున్నారు. వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, మచిలీపట్టణం ఇన్‌చార్జ్ ఉన్నమట్ల కబర్ధి, కొల్లి కొండ ప్రసాద్, బోడ కనకరాజు పాల్గొన్నారు.

మేడపాడులో..

యలమంచిలి: మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి సందర్భంగా బుధవారం మేడపాడు గరువు రామాలయం వద్ద బీజేపీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు దొంగ నరసింహకుమార్, నాయకులు వీరా జయరామాంజనేయులు (వీరాజీ), వల్లభు గణేష్, యర్రంశెట్టి కృష్ణభగవాన్ పాల్గొన్నారు.

సిద్ధాంతంలో..

పెనుగొండ: అణు పరీక్షలతో భారతదేశ సత్తాను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు వాజ్‌పేయి అని సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గని రాజు(చంటి) అన్నారు. బుధవారం సిద్ధాంతం రావిచెట్టు సెంటర్‌లో వాజ్‌పేయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్, లక్కు వర్మ, వంగూరి రామకృష్ణ, ఇరగవరపు రాధాకృష్ణ, వంగూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లులో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

రబీ సాగులో రైతులు బిజీ

- గ్రామాల్లో వరినాట్ల హడావుడి
- అన్నదాతలకు పలు సూచనలు, సలహాలు



దిరుసుమర్రులో వరి పొలాలను దున్నుతున్న దృశ్యం

భీమవరం అర్బన్: జిల్లాలోని రైతులు రబీ వరిసాగులో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ పంట కోతలు పూర్తికావడంతో రబీ పనులతో బిజీగా ఉన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా వరినాట్లు జోరుగు సాగుతున్నాయి. చీడపీడలను అధిగమించి, అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవడంతో పాటు నారుమళ్ల వేయడం, పెరిగిన నారుతో నాట్లు పనులు ఊపందుకున్నాయి. అయితే వ్యవసాయంలో సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెబుతున్నారు. ఎప్పటికప్పుడు పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్నారు. మండలంలో దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, బేతపూడి, కొమరాడ, చినఅమిరం, రాయలం, అనాకోడేరు, భీమవరం గునుపూడి, కొవ్వాడ అన్నవరం తదితర గ్రామాలలో సుమారు 8 వేల ఎకరాలలో దాళ్వా సాగుకు రైతులు శ్రీకారం చుడుతున్నారు.

అనేక ప్రయోజనాలు

వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. సాగు పనులు ప్రారంభించినప్పటీకీ నుంచి వీటిని చేపట్టాలి. తద్వారా పంటను చీడపీడలు, తెగుళ్ల ఆశించకపోవడంతో పాటు భూమికి సారం లభిస్తుంది. పంటలు ఏపుగా పెరుగుతాయి.

అధికంగా ఎరువులు వాడితే నష్టమే..

పంట ఏపుగా పెరగాలని, దిగుబడి ఎక్కువగా రావాలనే ఉద్దేశంతో కొందరు రైతులు తమ పొలాల్లో ఎరువులు, పురుగుమందులను విపరీతంగా వాడుతున్నారు. దీనివల్ల పెట్టుబడి బాగా పెరిగిపోవడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. పరిమితికి మించిన ఎరువుల వాడకం వల్ల నష్టం కలుగుతుంది. పొలంలో భూసార పరీక్షలు చేయించి, ఆ నివేదికలో వెల్లడైన ఆంశాల ఆధారంగా ఎరువులు వాడాలి. తద్వారా భూమికి అవసరమైన పోషకాలు లభిస్తాయి. ఈ వారంలో మరికొందరు రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దమ్ముచేసి నాట్లు వేయడానికి సిద్ధం చేశారు. అయితే విచిత్రంగా మండలంలో మెజార్టీ రైతులు ఇంకా నారుమడులు తయారీలోనే ఉన్నారు. కొన్ని చోట్ల విత్తనాలు చల్లుతున్నారు. మరో వారం రోజుల్లో మొత్తం నారుమడులు పూర్తి చేసే అవకాశం ఉంది. మొత్తంమీద వచ్చే నెలాఖరుకు దాళ్వా నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. సంక్రాంతికి నాటికే నూరుశాతం నాట్లు పూర్తిచేయాలన్న లక్ష్యంతో వ్యవసాయ అధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు.


వెదజల్లే పద్ధతి మేలు

రైతులు నారుమడులు వేయలేని, వరి నారు దొరకని రైతులు వెదజల్లే పద్ధతి అనుసరిస్తే సాగులో సుమారు రూ. 4 వేలు వరకు ఆదా అవడమే కాకుండా రెండు వారాలు ముందుగా వరి కోతకు వస్తుందని వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెబుతున్నారు.



మండలంలోని కొవ్వాడ అన్నవరంలో నారుమడిని పరిశీలిస్తున్న నిమ్మల శ్రీనివాస్

త్వరగా నాట్లు పూర్తిచేయాలి



వాతావరణ పరిస్థితులు దృష్ట్యా రైతులు త్వరగా నారుమడులు పూర్తిచేయాలి. ఈనెలాఖరుకు నాట్లు పూర్తిచేయడానికి యత్నించాలి. కనీసం జనవరి మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేయాలి. రబీసాగుకు స్వల్పకాలిక విత్తనాలు సాగుచేస్తే మంచి ఫలితాలుంటాయి.

నిమ్మల శ్రీనివాస్,
వ్యవసాయాధికారి, భీమవరం మండలం